టాస్క్ ఫోర్స్ అదనపు ఎస్పీగా కులశేఖర్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) అదనపు ఎస్పీగా జె. కులశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన తిరుపతి ఎఎస్పీ (శాంతి భద్రతలు) గా పని చేశారు. ఆయనను టాస్క్ ఫోర్స్ కు అటాచ్ చేయడంతో శనివారం బాధ్యతలు స్వీకరించారు. తరువాత ఆయన టాస్క్ ఫోర్స్ హెడ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు.

తిరుపతిలో..

గూడూరులో..

ప్రమాదకరమైన లేబర్‌కోడ్స్ అమలుపై ఆగ్రహం

ఉత్తర్వు కాపీలు దగ్ధం, నిరసనలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి, యంత్రాంగం

కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికులు సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాయడానికి నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చారని కార్మికసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రమాదకరమైన లేబర్‌కోడ్స్ అమలు ఉత్తర్వులను దగ్ధం చేస్తూ జిల్లావ్యాప్తంగా సిఐటియు, ఎఐటియుసి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తిరుపతి బస్టాండ్ ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు, ఎఐటియుసి నేతలు ఉత్తర్వులను దహనం చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుబ్రమణ్యం, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికులు సాధించుకున్నటువంటి కార్మిక చట్టాలను కాలరాయడానికి నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చారని విమర్శించారు. ఈ చట్టాలు అమల్లోకి వస్తే ఎనిమిది గంటల పని విధానం పోయి 13 గంటలు పని చేయాల్సి ఉంటుందన్నారు. సమ్మెలు చేసే హక్కు, సంఘాలు పెట్టుకునే హక్కు ఉండవన్నారు. మహిళలు రాత్రి వేళల్లో డ్యూటీలు చేయాల్సి వస్తుందని, రక్షణ లేకుండా పోతుందన్నారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎంలు కార్మికవర్గానికి ద్రోహం చేసేలా పది గంటల పని విధానాన్ని అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రమాదకరమైన లేబర్‌కోడ్ అమలును రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వర్గ వ్యతిరేక విధానాలను కార్మిక వర్గంలోకి విస్తృతంగా తీసుకెళ్లి ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.జయచంద్ర, ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, జి.బాలసుబ్రమణ్యం, పి.మునిరాజా, ఆర్.లక్ష్మి, ఎన్.మాధవ్, కె.వేణుగోపాల్, పి.బుజ్జి, ఎండి రవి, మహేంద్ర, శ్రీరాములు, కెవై రాజా పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

– శ్రీకాళహస్తిలో అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఇన్నాళ్లూ కార్మిక సంఘాల ఒత్తిడితో లేబర్‌కోడ్ అమలులో జాప్యం జరిగిందని, ఎప్పుడైతే మోడీ సర్కార్ బీహార్ ఎన్నికల్లో విజయం సాధించిందో తక్షణమే ఆచరణలోకి తీసుకొచ్చిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అమల్లోకి వస్తే కార్మికులు సమ్మె హక్కుతోపాటు అనేక ప్రయోజ నాలను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు పెనగడం గురవయ్య, గంధం మణి, ఈవ్వరయ్య, అన్వర్‌బాష పాల్గొన్నారు.

పుత్తూరులో..

– గూడూరు టౌన్‌లో టవర్‌క్లాక్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఇప్పటివరకూ ఏదైనా కర్మాగారం లేఆఫ్ ప్రకటించాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరని, అయితే ప్రస్తుతం ఈ షరతు 300 మంది కార్మికులున్న కంపెనీలకు వర్తించేలా మార్చారన్నారు. దీంతో ఇష్టానుసారంగా లాకౌట్లు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పామంజి మణి, బివి రమణయ్య, జోగి శివకుమార్ పాల్గొన్నారు.

– పుత్తూరులో అంబేద్కర్ సర్కిల్ వద్ద సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, ఎఐటియుసి గౌరవాధ్యక్షులు డి.మహేష్, ఎన్.చంద్రబాబు, విజయ్ పాల్గొన్నారు. 140 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాన్ని రోజుకు పది గంటల నుంచి పద్నాలుగు గంటలకు మారుస్తూ కార్మిక చట్టాల్లో మార్పులు తెచ్చారన్నారు.

– సత్యవేడులో ప్రమాదకరమైన లేబర్ కోడ్స్ అమలుపై నిరసన జరిగింది. కార్మిక హక్కులమీద ఉద్యోగ భద్రత మీద, జీతభత్యాలపైనా వేటు వేసేందుకు యాజమాన్యాలకు ఆయుధంలా అమలు చేసే చట్టాలు ఉపయోగపడతాయన్నారు. నాయకులు దేశాండి అరుణాచలం, విజయభాస్కర్, తిరుమలరెడ్డి, ఎలుమలైరెడ్డి పాల్గొన్నారు.

కళత్తూరు పునరుద్ధరణకు రూ.కోటి నిధులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రాయల్ చెరువు ప్రమాదంలో చిద్రమైన కళత్తూర్ గ్రామానికి ఎంపీ మద్దిల గురుమూర్తి తన నిధుల నుంచి కోటి రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. తిరుపతి జిల్లా అభివద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) శనివారం తిరుపతి జిల్లా కలెక్టరు సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో దిశ కమిటీ ఛైర్మన్ హోదాలో తిరుపతి ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు సమస్యలు చర్చకు వచ్చాయి. ఇందులో ప్రదానంగా వర్షాకాలం చెరువు కట్టలు బలోపేతం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఎంపీ కోరారు. కళత్తూరులో జరిగిన సంఘటనలు మరెక్కడా పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు.కలత్తూరు, కలత్తూరు హరిజనవాడ, పాతపాలెం గ్రామాలలో జరిగిన నష్టానికి సరైన పరిహారం అందించాలని ఎంపీ సూచించారు. ఈ వరదలో గ్రామంలోని అందరి ఇళ్లలోని గ్యాసు సిలిండర్లు కూడా కొట్టుకు పోయాయని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు సిఎస్ఆర్ కింద వారికి మరలా సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని కోరారు. తిరుపతి జిల్లాలో

కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధి (సిఎస్ఆర్) కింద సుమారు రూ.180 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, ఎక్కడో ఖర్చు చూపుతున్నారని, కనీసం 40 శాతం నిధులు జిల్లాలో ఖర్చు చేసే విదంగా చర్యలు తీసుకోవాలని కలెక్టరుని కోరారు. ఆ నిధులను అత్యవసర సమయాలలో వినియోగించుకోవచ్చని ఎంపీ తెలిపారు. అంగన్‌వాడీ పిల్లల్లో జన్యులోపాలతో ఉండే వారిని ఎంత మందిని గుర్తించారని ఎంపీ ప్రశ్నించగా, అందుకు అధికారులు సమాధానం ఇస్తూ ప్రస్తుతానికి చంద్రగిరి నియోజకవర్గంలోన మూడు పంచాయితీలలో, పైలెట్ ప్రాజెక్టు కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ ప్రాజెక్టు జిల్లా మొత్తం అమలు చేయాలని ఎంపీ సూచించారు

స్వర్ణరథంపై మహాలక్ష్మి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శనివారం సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 4.20 గంటల నుండి ఆలయ మాడ వీధుల్లో ఈ ఉత్సవం నిర్వహించారు. కాంతులీనుతున్న స్వర్ణ రథంపై శ్రీ పద్మావతి అమ్మవారు విశేష స్వర్ణ, వజ్రాభరణాలను ధరించి భక్తులకు కనువిందు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని స్వర్ణరథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో జేఈఓ వి.వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఎస్ ఇ- 3 జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. శనివారం ఉదయం సర్వభూపాల వాహన సేవ జరిగింది. టిటిడి హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 16 కళాబృందాలు 300 మంది కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు.

ఓపెన్ బ్రిడ్జి ఛాంపియన్‌షిప్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి ఆఫీసర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఓపెన్ బ్రిడ్జి ఛాంపియన్‌షిప్‌ను క్రీడాస్ఫూర్తి ప్రతిబింబించేలా శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. బ్రిడ్జి క్రీడలు కేవలం గేమ్స్ మాత్రమే కాదని, మానసిక చురుకుదనం, వ్యూహాత్మక ఆలోచన, సమయోచిత నిర్ణయ సామర్థ్యం, సమన్వయ భావన వంటి విలువైన లక్షణాలను పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోటవాసు, టోర్నమెంట్ ఆర్గనైజర్ రవీంద్ర, బ్రిడ్జి గేమ్ అసోసియేషన్ సభ్యులు పి.నరసింహరావు పాల్గొన్నారు.

మోహన్‌బాబు స్వర్ణోత్సవ సంబరాలు

ప్రజాశక్తి - చంద్రగిరి

పద్మశ్రీ డాక్టర్ మోహన్‌బాబు తెలుగు వెండి తెరపై 50 ఏళ్ల పూర్తి చేసుకుని స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకుంటున్న సందర్భంగా మోహన్‌బాబు యూనివర్సిటీలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, డిఎఫ్ఎ బి.రవిశేఖర్ పాల్గొన్నారు. కేకు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

డ్రగ్స్, ర్యాగింగ్ భూతాలను తరిమేద్దాం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

విద్యాలయాల్లో డ్రగ్స్, ర్యాగింగ్ భూతాలను తరిమేద్దాం' అంటూ వక్తలు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలు త్వరలో జరగనున్న నేపథ్యంలో చిగురువాడ గేట్ కళాశాలలో 'డ్రగ్స్ ఫ్రీ సొసైటీ.. ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్'పై సెమినార్ నిర్వహించారు. తల్లిపాల నిధి ప్రాజెక్టు ఛైర్మన్, గోవిందధామం మాజీ అధ్యక్షులు టెంకాయల దామోదరం, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు డాక్టర్ కిషోర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. విద్యాలయాలు సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు, గొప్ప ఆదర్శ సమాజాన్ని నిర్మించే వేదికగా మెలగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి చైతన్యంతో మెలగాలన్నారు. సృజనాత్మకమైన ఆలోచనలకు శ్రీకారం చుట్టాలన్నారు. పోరాటాలతో పాటు, సమాజ హితం కోసం పాటుపడేలా విద్యార్థులను ఐక్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు నరేంద్ర, తేజ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రణీత్ పాల్గొన్నారు.

జండర్ రిసోర్స్ కేంద్రాల ఏర్పాటు

తొలి విడతలో ప్రయోగాత్మకంగా నాలుగు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు గహహింసకు, వరకట్నం, లైంగిక వేధింపులు, మానసిక వేదనకు గురి చేసే సంఘటనల నుండి వారిని చైతన్యవంతులను చేస్తూ హక్కులను, న్యాయ సహాయాన్ని అందించడానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఎక్కువగా మహిళల సమస్యలు ఉత్పన్నమవుతున్న మండలాల జాబితాను తయారుచేసి ప్రయోగాత్మకంగా జండర్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి సంకల్పించింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఈ కేంద్రం ఏర్పాటుకు ఒక్కో కేంద్రానికి రూ. 5 లక్షల రూపాయలు మంజూరు చేయనుంది. డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్మెంట్ అథారిటీ (డిఆర్డిఏ) పర్యవేక్షణలో మండల సమాఖ్య కార్యాలయాలలో ఈ సెంటర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. శోభన్ బాబు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జండర్ రిసోర్స్ కేంద్రం ఏర్పాటుకు నాలుగు మండలాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసామన్నారు. చంద్రగిరి, శ్రీకాళహస్తి, పిచ్చాటూరు, కోట మండలాలలో జండర్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపాము అని తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు జండర్ రిసోర్స్ కేంద్రాలకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యను తెలియజేస్తే తగిన పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సెంటర్ నిర్వహణ కోసం ప్రతినిధుల ఎంపికను చేస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండే వారిలో విద్యావంతులు, చురుకుగా ఉండి మహిళల సమస్యలపై అవగాహన ఉన్నవారికి మొదటగా ప్రతినిధిగా ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై సాంస్కృతిక భేరి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, మతోన్మాదంపై సాంస్కృతిక భేరి మోగించాలని వక్తలు ఉద్ఘాటించారు. విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు జరుగుతున్న సిఐటియు ఆలిండియా మహాసభల సందర్భంగా రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన కళాకారులకు తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శని, ఆదివారాల్లో వర్కుషాపు ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్ మాట్లాడుతూ మహాసభల జయప్రదానికి సాంస్కృతిక కార్యకలాపాల ద్వారా కార్మిక వర్గాలలోకి చురుగ్గా తీసుకెళ్లాలన్నారు. ఈ వర్కుషాపులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, నెల్లూరు జిల్లా నాయకులు రెహమాన్‌బేగం, నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ ఎం.రాజు, కళాకారులు వేణు, సెల్వరాజు, ఒవి రమణ, బుజ్జమ్మ పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే కగార్ : వామపక్షాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరిట నక్సల్స్‌ను పట్టుకున్న తర్వాత బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేస్తోందని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. శనివారం గంధమనేని శివయ్య భవనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నాయకులు కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు మాట్లాడుతూ మావోయిస్టు నేత హిడ్మాను భూటకపు ఎన్‌కౌంటర్ ద్వారా హతమార్చారన్నారు. ఆ ఘటనపై నిష్పాక్షిక విచారణ తప్పనిసరిగా జరగాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్ భావజాల మోడీ ప్రభుత్వమే సహజ వనరుల దోపిడీకి కార్పొరేట్ శక్తులకు మార్గం సుగమం చేస్తూ మావోయిస్టులను అంతమొందిస్తోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లన్నీ రాజ్యాంగంపై జరిగిన ప్రత్యక్ష దాడులే అన్నారు. ఇప్పటివరకూ 500 మందికి పైగా ఆదివాసులు ఎన్‌కౌంటర్ల పేరిట ప్రాణాలు కోల్పోయారన్నారు. పౌర హక్కుల సంఘం నేత క్రాంతి చైతన్య మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లోని విలువైన ఖనిజాలను కార్పొరేట్లకు అప్పగించేందుకు, మావోయిస్టులపై ఆపరేషన్ కగార్ పేరిట దాడులు చేస్తున్నారన్నారు. మావోయిస్టులను తుదముట్టించినా వారి సిద్ధాంతాన్ని చంపలేరన్నారు. సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ

మాట్లాడుతూ ఆదివాసీలు అడవుల నిజమైన రక్షకులని, వారిని నిర్లక్ష్యం చేయడం వల్లే నక్సలిజం ఉద్భవించిందన్నారు. ఆర్‌పిఐ అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మావోయిస్టులను అంతం చేయడాన్ని ప్రధాన లక్ష్యంగా మార్చుకుందన్నారు. ఎర్రజెండా కనబడకుండా చేస్తూ, కాషాయ జెండా దేశం నిండా ఎగరేయడం మోదీ అజెండా అన్నారు. మార్చి చివర్లో మావోయిస్టులను పూర్తిగా తరిమేస్తామని ప్రకటించిన అమిత్ షాపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కవులు, కళాకారులు, అభ్యుదయవాదులను జైలులో పెట్టడం ఫాసిస్టు ధోరణి అని అన్నారు. సిపిఐ ఎమ్ఎల్ నగర కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, ప్రశ్నించే వామపక్ష నేతలను అర్బన్ నక్సలైట్లు అంటూ కేసులు పెడుతోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో వామపక్ష ఉద్యమం బలోపేతం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మావోయిస్టు నేత చంద్ర శేఖర్ రెడ్డి, సుశీ పార్టీ నేత హరీష్, సిపిఐ నాయకులు విశ్వనాథ్, రామచంద్రయ్య, సిపిఐ ఎం ఎల్ నేత వెంకయ్య, బి ఎస్ పి నేత శశికుమార్ పాల్గొన్నారు.

కేసుల హోరు.. విచారణ జోరు...!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో అనునిత్యం ఆసక్తిని కలిగిస్తోంది, ప్రతిపక్ష నాయకులను భయాందోళనకు గురి చేస్తోంది రెండు అంశాలు. ఒకటి పరకామణి వ్యవహారం, రెండోది కల్తీనెయ్యి. పాలకపక్షం రోజుకో కొత్త ట్విస్టును ఇస్తూ తిరుపతి కేంద్రంగా విచారణ చేపట్టింది. ఈ రెండు కేసులకు కేంద్రబిందువు టీటీడీ కావడం గమనార్హం. రాష్ట్రంలో హోరెత్తిస్తున్న మరో కేసు లిక్కర్ స్కామ్. ఇందులో కూడా ఉమ్మడి జిల్లాలకు చెందిన వైసిపి ప్రధాన నాయకులే ప్రధానంగా ఉండడం కొసమెరుపు.

దేశవ్యాప్తంగా అలజడి సష్టించినవి పరకామణి, కల్తీనెయ్యి కేసులు. ఈ రెండు కేసుల్లోనూ మాజీ టిటిడి ఛైర్మన్లే కీలక పాత్రధారులుగా నిరూపించేందుకు కూటమి ప్రభుత్వం విశ్వప్రయత్నం చేస్తోంది. ఈ కేసులు ఎప్పుడు ఎవ్వరి మెడకు చుట్టుకుంటుందోననే భయాందోళన అటు అధికారులకు ఇటు టిటిడి సిబ్బందికి తప్పడం లేదు. పరకామణి కేసులో తిరుమల పెద్దజీయ్యర్ మఠానికి చెందిన ఉద్యోగి రవి కుమార్ 2023, ఏప్రిల్ 29న 72వేల రూపాయలు విలువ చేసే 90 విదేశీ డాలర్లు చోరిచేస్తూ విజిలెన్స్‌కు పట్టుబడ్డారు. అప్పట్లో విధుల్లో ఉన్న ఏవిఎస్వో సతీష్ కుమార్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 379, 381 ఐపిసి సెక్షన్ల ప్రకారం రవికుమార్‌పై కేసు నమోదు చేసి, 41 సిఆర్పి నోటీసులు ఇచ్చి ఇంటికి పంపించేశారు. జూన్ 1వ తేదిన నిందితుడు, ఫిర్యాదుదారుడు ఇద్దరూ కలిసి స్థానిక కోర్టులో కేసు రాజీ చేసుకునేందుకు పిటీషన్ దాఖలు చేశారు. అదే ఏడాది సెప్టెంబరు 9న లోక్‌అదాలత్ కోర్టులో ఏవిఎస్వో సతీష్ కుమార్, నిందితుడు రవికుమార్ రాజీ కుదుర్చుకున్నారు. అంతటితో అది ముగిసిందనుకుంటే స్థానిక జర్నలిస్టు పరకామణిలో రవికుమార్ కేసును సిఐడి చేత విచారణ జరిపించాలని హైకోర్టును ఆశ్రయించారు. దీనికి అదే నెల 25వ తేది టిటిడి ఈవో కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు ఈ కేసు విచారణ చేపట్టాలని సిఐడి సిట్ ను నియమించింది. దానికి అడిషనల్ డిజి రవిశంకర్ అయ్యనార్ ఆధ్వర్యంలో 25 మంది బందంతో ఏర్పడిన సిఐడి సిట్ తిరుపతి భూదేవి కాంప్లెక్సో తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసి విచారణ ముమ్మరం చేసింది. నవంబరు 6న రవికుమార్ పై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎవిఎస్వి సతీష్ కుమార్‌ను ఆరు గంటల పాటు విచారించింది. 10న తిరుమల 1టౌన్ పోలీసులను, 12న సిఐ జగన్మోహన్రెడ్డిని రెండో సారి విచారించింది. నవంబరు 14వ తేది రెండో సారి సిట్ ముందు హాజరయ్యేందుకు వస్తున్న ఏవిఎస్వి సతీష్ కుమార్ తాడిపత్రి సమీపంలోని కోమలి గ్రామం రైల్వేట్రాక్ పక్కన అనుమానాస్పద రీతిలో మతి చెందారు. అదే రోజు టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, సీనియర్ నాయకులు శైలజనాథ్ సతీష్ కుమార్ పై తీవ్ర ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని ప్రకటించడంతో, హత్యా, ఆత్మహత్య తెలియక ముందే వైసిపి వాళ్ళు ఆత్మహత్యగా చిత్రీకరించేసారని కూటమి నాయకులు అందుకు దీటుగా సమాధానం చెప్పారు. పరకామణి కేసుతో పాటు ఏవిఎస్వి సతీష్ కుమార్ మతిపై కూడా సిఐడి సిట్ దర్యాప్తు వేగవంతం చేసింది.

మరో పక్క తిరుమల లడ్డు తయారీలో యుపికి చెందిన బోలేబాబా డెయిరీ, తిరుపతికి చెందిన వైష్ణవి డెయిరీ, చెన్నయ్‌కి చెందిన ఏఆర్ డెయిరీ రహస్య ఒప్పందంలో భాగంగా కల్తీనెయ్యి వాడారని మాజీ ఈవో శ్యామలరావు కల్తీనెయ్యి వ్యవహారాన్ని 2024 ఆగస్టులో తెరపైకి తీసుకొచ్చారు. మాజీ ఛైర్మన్లు వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి చొరవతోనే ఇది జరిగిందని కూటమి నాయకులు విమర్శలు గుప్పించారు. లడ్డుకు వాడే నెయ్యిలో ఆవుకొవ్వు కలిపారని విమర్శించారు. ఇది పెద్ద దూమారం రేగడంతో కొన్ని రోజుల తర్వాత కల్తీ జరిగిన మాట వాస్తవమే కానీ, ఆ నెయ్యిని లడ్డు తయారీకి వాడలేదని, తిరిగి పంపించేశామని అప్పటి ఈవో వివరణ ఇచ్చారు. ఈ కేసును మళ్లీ తిరగదోడి విచారణ బాధ్యతను సిట్ కు అప్పగించారు. టిటిడి మాజీ ఇన్‌ఛార్జి ఈవో ధర్మారెడ్డిని రెండు రోజుల పాటు సిట్ అధికారులు తిరుపతిలో విచారించారు. తాజాగా రెండు రోజుల క్రితం మరో మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో సిట్ అధికార్లు ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు సుదీర్ఘంగా విచారించి, ఆయన సమాధానాలను రికార్డు చేశారు. త్వరలోనే దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు.

రాష్ట్రాన్ని ఊపేస్తున్న మరో కేసు లిక్కర్ స్కామ్. దీనిపై జిల్లాకు చెందిన ఎంపి పెద్దిరెడ్డి మిథున్రెడ్డి జైలుజీవితం గడిపి, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. చంద్రగిరి మాజీ ఎంఎల్ఏ టిటిడి మాజీ బోర్డు సభ్యులు చెవిరెడ్డి బాస్కర్రెడ్డి ఈ కేసులోనే సుమారు. 157రోజులుగా జైలు జీవితం గడుపుతున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం చెవిరెడ్డి బాస్కర్రెడ్డి, అతనిభార్య లక్ష్మి, కుమారులు చెవిరెడ్డి మోహిత్రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్రెడ్డి పేర్లతో ఉన్న ఆస్తులను జప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ కేసులో శుక్రవారం కోర్టుకు హజరైన చెవిరెడ్డి బాస్కర్రెడ్డి ఆస్తుల జప్తు విషయమై న్యాయమూర్తి ముందే తన ఆవేదనను వినిపించారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్రెడ్డికి అన్నీ తామే అనేలా వ్యవహరించిన వ్యక్తుల్లో వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముఖ్యులు. వీరిపై తిరుపతి కేంద్రంగా కేసులు నమోదు చేసి, విచారణ పేరుతో కూటమి ప్రభుత్వం రోజుకో ట్విస్ట్ ఇస్తోంది. ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేస్తున్న కూటమి ప్రభుత్వం, ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని ప్రజాసంఘాల నేతలు విమర్శిస్తున్నారు.

జర్నలిస్ట్ శ్రీనివాస్‌కు భద్రత ఇవ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిటిడి పరకామణి కేసు పునర్విచారణ జరిపించాలని రీ పిటీషన్ వేసిన హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషనర్ జర్నలిస్టు మాచర్ల శ్రీనివాసుకు భద్రత కల్పించాలని హైకోర్టు జడ్జి వెంకట జ్యోతిర్మయి శనివారం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వానికి, కేసును విచారిస్తున్న సిఐడికి, తిరుపతి ఎస్పి సుబ్బరాయుడుకు ఆదేశించింది. పరకామణి కేసును అర్ధాంతరంగా ముగించారని, వందల కోట్ల అక్రమాలు జరిగాయని, రాజీ కుదుర్చుకున్నారని తిరుపతికి చెందిన జర్నలిస్టు రిట్ పిటిషన్ వేశారు. ఈ ఘటనలో టిటిడి మాజీ ఎవిఎస్ఒ సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతితో, తనకూ భద్రత కల్పించాలని శ్రీనివాస్ కోరారు. ఈ నేపథ్యంలో సాక్ష్యులు, పిటిషనర్లు, నిందితులకు పోలీసు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది.

పశువుల దాణా పంపిణీకి సిద్ధం

పశువైద్యాధికారి మునిరాజా

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో పాడి రైతులకు 50 శాతం సబ్సిడీ ధరలపై పశువులు దాణా పంపిణీకి సిద్ధంగా వుందని త్వరలో అందిస్తామని బుచ్చినాయుడు కండ్రిగ మండల పశువైద్యాధికారి మునిరాజా కాటూరు, పశు వైద్యాధికారిణి డాక్టర్ అశ్విని పేర్కొన్నారు. పాడి రైతులకు అవసరమైన పశువుల దాణా అందుబాటులో వుందన్నారు. ఇందులో భాగంగానే బుచ్చినాయుడు కండ్రిగ పశు వైద్యశాలలో 190 బ్యాగులు, ఏడీ కార్యాలయంలో బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇదిగాక నవంబర్ 24వ తేదీ మరో వంద బ్యాగులు పశువుల దాణా పశువైద్యశాలలో అందుబాటులో ఉంటుందన్నారు. 50 కేజీల పశు వుల దాణా 50 శాతం సబ్సిడీ పోను పాడి రైతులు 580 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక ఆధార్ కార్డుపై రెండు బ్యాగులు పాడి రైతులకు ఇస్తామని తెలిపారు. అవసరమైన వారు సమీప పశువైద్యశాలకు వెళ్లి పశువుల దాణా తీసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9441767649 మొబైల్ నెంబరును సంప్రదించాలన్నారు.

ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు

షటిల్ బ్యాడ్మింటన్ కప్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడవ సంవత్సరం బిఏస్‌సి విద్యార్థినులు బి మునిలక్ష్మి, బి శ్రావణి ఇటీవల జవహర్ భారతి డిగ్రీ కళాశాల కావలిలో నిర్వహించిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఆటల పోటీలలో రన్నర్ అప్ కప్ గెలుచుకొని విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సింహాద్రి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి నారాయణరాజు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థినిలను అభినందించారు.

హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల పరిశీలన

ప్రజాశక్తి -బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూలు విద్యార్థుల సమగ్ర విద్యార్థి అభివృద్ధి పత్రాలు (హెచ్‌పిసి)ను ఎంఈవోలు రవీంద్ర నాథ్, మునిసుబ్రహ్మణ్యం శనివారం మండల విద్యాశాఖ తనిఖీ చేశారు. కార్డుల్లో ఉన్న విద్యార్థుల పరీక్షల మార్కులను పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల మార్కులను హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసినట్లు వివరించారు. వీటిలో విద్యార్థుల వ్యక్తిగత, ఆటల పోటీల వివరాలు, ఇతర సమగ్ర సమాచారం పొందుపరిచినట్లు తెలిపారు. అనంతరం ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించి ప్రధానోపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య, ఉపాధ్యాయులు, సీఆర్‌పిలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న విద్యార్థిని విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక, గోవింద పాలెం లోని శ్రీ విద్య డిగ్రీ కళాశాలలో శనివారం తిరుపతి రక్షణ ఫౌండే షన్ బ్లడ్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పుత్తూరు, కళాశాల ఎన్ఎస్ఎస్ టీమ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో విద్యార్థులందరికీ హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూప్, హెచ్‌ఐవి, విడిఆర్ ఎల్, మలేరియా తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రక్తదానం చేసిన 63 మంది విద్యార్థులకు రక్షణ ఫౌండేషన్ సంస్థ తరఫున బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో రక్షణ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శిల్ప శ్రీ, ఆర్గనైజర్ లవకుమార్, వినోద్, శ్రీవిద్య కళాశాల చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యం, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మురగవేల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా సాయం పంపిణీ

ప్రమాద బీమా సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రోడ్డు ప్రమాదంలో మరణించిన కనకం పాలెం గ్రామ కార్యకర్త కుటుంబానికి టిడిపి అందించిన ప్రమాద బీమా సాయాన్ని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ శనివారం అందించారు. పుత్తూరు కనకం పాలెం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వి సుబ్రహ్మణ్యం దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో కార్యకర్త ప్రమాద బీమా ప్రయోజనాల కోసం పత్రాలను సేకరించి, నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా టిడిపి రాష్ట్ర కార్యాలయానికి పంపా రు. వారి పరిశీలన తర్వాత టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఏర్పాటు చేసిన 'టిడిపి – కార్యకర్తల సంక్షేమ విభాగం' నుండి మంజూరైన ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని సుబ్రహ్మణ్యం భార్య గీతకు అందించారు.

నేటి బహిరంగ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలో ఈ నెల 23వ తేదీ సాయంత్రం నిర్వహిం చనున్న భారత రాజ్యాంగ దినోత్సవ రాష్ట్ర స్థాయి భారీ బహిరంగ సభకు బహు జనులు స్వచ్ఛందంగా తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని బహుజన ఐక్యవేదిక, మాల ఉద్యోగుల జేఏసీ సభ్యులు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా కోటలో శనివారం విలేకరుల సమావేశంలో బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మీజూరు మాధవ్, బహుజన ఐక్యవేదిక నాయకులు దాసరి సుందరం, బహుజన ఐక్యవేదిక ప్రధాన లీగల్ అడ్వైజర్ దాసరి అశోక్ కాంబ్లె, అడ్వకేట్‌లు మాట్లాడుతూ కోట గ్రామ పంచాయతీ ఆఫీస్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో ఈ నెల 23వ తేదీ ఆదివారం 3 గంటలకు నిర్వహించనున్న భారత రాజ్యాంగ దినోత్సవ రాష్ట్ర స్థాయి భారీ బహిరంగ సభకు బహుజనులు దళితులు, మాలలు అందరూ స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ బహిరంగ సభకు పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులు హాజరు కానున్నారని తెలిపారు.

అప్రమత్తంగాఉండాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: రానున్న రెండు రోజుల్లో జిల్లాలో సెన్యార్ తుపాన్ ప్రభావం ఉంటుందని బుచ్చినాయుడు కండ్రిగ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు శ్రీదేవి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన సెన్యార్ తుపాను హెచ్చరికలు ఉండని ఈ సమయంలో మండల ప్రజలు బయటకు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల, గ్రామస్థాయి, అధికారులు, సచివాలయ సిబ్బంది తుపాన్ పరిస్థితిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మానవ నష్టం, జంతునష్టం నివారించేందుకు పని చేయాలన్నారు. తుపాన్ ప్రభావంపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలన్నారు. తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని ప్రజలు ఏదైనా అవసరం ఉంటే కాల్ సెంటర్ నెంబరును 9491077047 సంప్రదించాలన్నారు.

నాసా స్పేస్ ప్రాజెక్టుకు శ్రీ చైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు 27 మంది నాసా స్పేస్ ప్రాజెక్టుకు ఎంపికయ్యారని శ్రీ చైతన్య సంస్థల ఏజీఎం ఎన్ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం ఎన్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సృజనాత్మకతను పెంపొందించుకోవాలని అన్నారు. కోటలోని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ గోను చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధారా మస్తానయ్య హాజరయ్యారు. అనంతరం నాసా స్పేస్ ప్రాజెక్టులో ఎంపికైన విద్యార్థులకు నాసా కిడ్స్ అందించారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రాజెక్టులను ఏరోనాటికల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ సంస్థకు పంపుతామని ఎంఈఓ ధారా మస్తానయ్య తెలిపారు. ఈ ప్రాజెక్టులో ఎంపికైన విజేతలకు అమెరికాలో నిర్వహించనున్న అంతర్జాతీయ శాస్త్రవేత్తల సదస్సులో పాల్గొని నగదు బహుమతులను గెలుచుకునే అవకాశం ఉంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల ఆర్ఐ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ గోను చిరంజీవి, డీన్ శివయ్య, జోనల్ పిఈటీ ఠాగూర్ బాబు, ప్రైమరీ ఇన్‌ఛార్జ్ హరిత, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జ్ వినీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే సస్పెన్షన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి–కరకంబాడి మార్గంలోని మంగళం రవాణా శాఖ కూడలి వద్ద సెల్‌ఫోను వినియోగిస్తూ వాహనాలు నడిపిన 22 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేయడమే కాకుండా వారికి వాహన చట్టం, అపరాధ రుసుములుపై అవగాహన కల్పించినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. కేసులు నమోదు చేసిన వారిలో ఎక్కువమంది యువత ఉండడంతో ఆర్టీవో ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యత కలిగిన యువత చట్టాలను మీరి సెల్ ఫోన్ను వినియోగిస్తూ వాహనాలు నడపడం, నిబంధనలకు విరుద్ధంగా ట్రిపుల్ రైడింగ్ చేయడంతో వారందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి శ్రీనివాసరావు, ఎంవిఐ అతికానాజ్ డ్రైవింగ్ చేసే సమయంలో మొబైల్ వినియోగిస్తే మూడు నెలల వరకు లైసెన్సును సస్పెండ్ చేయడానికి సిఫార్సు చేస్తామని యువతను హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

సంకలన పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్రం విభాగం రూపొందించిన 'భారత్– ఆఫ్రికా దేశాలమధ్య సంబంధాలలో సరికొత్త హద్దులు" అనే పరిశోధనా పత్రాల సంకలన పుస్తకాన్ని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య నరసింగరావు ఆవిష్కరించారు. 27–28 డిసెంబర్ 2019 లో నిర్వహించిన "భారత్– ఆఫ్రికా దేశాలమధ్య సంబంధాలలో సరికొత్త హద్దులు" అంతర్జాతీయ సెమినార్‌లో సమర్పించిన పరిశోధనా పత్రాలలో ఎంపిక చేసిన పరిశోధనా పత్రాలతో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు పుస్తక సంపాదకులు ఆచార్య బివిమురళీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సంపాదకులు డాక్టర్ ఐయస్‌కిశోర్, డాక్టర్ఐసుబ్రమణ్యం, డాక్టర్‌బి నాగరత్నం రెడ్డి, డాక్టర్.కెయస్ కన్నన్, ఎస్‌వియు స్టూడెంట్ వెల్ఫేర్ కల్చరల్ అఫైర్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

బిఎన్‌కండ్రిగ టిడిపి అధ్యక్ష పదవి ఇవ్వండి

కోఆర్డినేటర్‌కు మునిసుబ్బయ్యరాయల్ వినతి

వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: తనను బిఎన్ కండ్రిగ టిడిపి అధ్యక్షుడిగా నియమించాలని బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలోని నీరుపాకోటకు చెందిన అంకు ముని సుబ్బయ్య రాయల్ సత్యవేడు నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ శంకర్ రెడ్డిని శనివారం తన అనుచరులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను1996 నుండి 2024 వరకు పార్టీలో ఎన్నో పదవుల్లో కొనసాగి పార్టీకి ఎంతో సేవ చేశానని తెలిపారు. తనను గుర్తించి సత్యవేడుకి ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విచ్చేసినప్పుడు ఉత్తమ కార్యకర్తగా తనకు గుర్తింపు ఇచ్చారన్నారు. బిఎన్ కండ్రిగ మండలంలో టిడిపి శ్రేణులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. మండలంలోని ప్రథమ, ద్వితీయ, శ్రేణుల నాయకులను కార్యకర్తలను అందరితో కలుసుకుని సీనియర్ల సహాయ సహ కారాలతో పార్టీ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేలా ముందుకు వెళతానని ఆయన మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మహిళలు ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పొదుపు సంఘాలు రాష్ట్రంలో ప్రవేశపెట్టారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే పలు అంశాలపై సమీక్షించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పొదుపు సంఘాలను తీసుకువచ్చి అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి అందించారని గుర్తు చేశారు. గత ఐదు సంవత్సరాలలో వైసిపి ప్రభుత్వంలో పొదుపు మహిళలకు చేసింది ఏమీ లేదని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మధుసూదన్ రావు, వివిధ శాఖల అధికారులు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

రామకృష్ణకు ఎంజీఎం ఆతిథ్యం

రామకృష్ణను ఆహ్వానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనార్థం విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తనయుడు నందమూరి రామకృష్ణకు స్థానిక ఎంజీఎం గ్రాండ్ హోటల్ శనివారం ఆతిథ్యమిచ్చింది. ఎంజీఎం సంస్థల అధినేత గుడ్లూరు మల్లికార్జున నాయుడు, డైరెక్టర్ మయూర్ సాదర స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు. రామకృష్ణతోపాటు టిడిపి ఎమ్మెల్సీ జనార్దన్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఎంజీఎం సంస్థలు గత 30 ఏళ్లుగా ఉపాధి, విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు చేస్తున్న సేవలను వారు కొనియాడారు.

తల్లి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు

- మయూరి శ్యామ్‌యాదవ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని మినీ గురుకులంలో మయూరి శ్యామ్ యాదవ్ మాతృమూర్తి బండి వనమ్మ 4 వ వర్ధంతి సందర్భంగా గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ సేవా సమితి దాతృత్వంతో తాగు నీరు సదుపాయాలు, సింటెక్స్ ట్యాంకు, కుళాయిలు , పైపులైన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లా డుతూ బాగా చదివి ఉన్నత స్థాయికి రావాలంటే చదువును కష్టంగా గాక ఇష్టంగా చదవాలని అప్పుడే అనుకున్న లక్ష్యం సాధిస్తారని అందుకే అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగ పడే మంచి నీటి సదుపాయం (సింటెక్స్ ట్యాంకు, కుళాయిలు, పైపులైన్ ఏర్పాటు చేశా మన్నారు. గురువులు చెప్పేది అవగాహన చేసుకుంటే భవిష్యత్తులో సమాజంలో మంచి వ్యక్తు లుగా రాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లురెడ్డి , సెక్రెటరీ మల్లు విజయ్ కుమార్ రెడ్డి , ప్రోగ్రాం కోఆర్డినేటర్ మేరీ ప్రియత , దాత డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ , హెచ్‌ఎం కె. విరజిని కుమారి, సీనియర్ రోటోరియన్స్ దశరథరామి రెడ్డి , బాలకృష్ణరాజు , టి సురేష్ రెడ్డి , కె నాగసునీల్ , నిరంజన్ రెడ్డి , విద్యార్థినులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండ: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి రూరల్ మండలం యాతలూరులో శనివారం పిడుగుపాటుకు గురై మరణించిన రెడ్డిపల్లి మహేష్ (24) కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇచ్చారు. మహేష్ మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శించారు. మహేష్ మరణానికి దారితీసిన పరిణామాలను వివరంగా అడిగి తెలుసు కున్నారు. సెన్యార్ తుపాను ప్రభావంతో పిడుగుపాటు సంభవించిన ఘటనగా ప్రభుత్వం గుర్తించేలా తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నుంచి లభించాల్సిన ఆర్థిక సహాయం కుటుంబానికి చేరేలా అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు. తుపాను సమయంలో అప్రమత్తతే ప్రాణాలకు రక్షణ అని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పిడుగులు పడే అవకాశాలపై ముందస్తే గ్రామానికి సమాచారం చేరి ఉండి ఉంటే మహేష్ లాంటి ప్రాణనష్టం జరగేది కాదని ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. తుఫాను పూర్తిగా తగ్గే వరకు గ్రామస్తులు పంటపొలాల్లో పనులు వాయిదా వేసు కోవాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాము ఖ్యత ఇవ్వాలని అధికా రు లు, ప్రజలు ఇద్దరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

మాక్ అసెంబ్లీ

ప్రజాశక్తి-నాయుడుపేట: భారత రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎల్‌ఏ సాగరం జెడ్‌పి హైస్కూల్లో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. నవంబర్ 26 సంవిధాన్ దివస్‌ను పురస్క రించుకొని జీఎస్‌టి 2.0పై మాక్ అసెంబ్లీ నిర్వ హించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్, బిల్డ్ స్ట్రాంగ్ ఇండియా అంటూ ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే మార్కెట్ అంశాలపై చర్చిం చారు. జీఎస్టీ 2.0 పేద విద్యా ర్థులకు, మధ్య తరగతి కుటుంబాలకు, రైతులకు లబ్ధి చేకూరే అంశా లను వివరించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు కె.మీనా కుమారి, ఉపాధ్యాయులు డాక్టరు సుబ్రహ్మణ్యం, జి సుబ్రహ్మణ్యం, జి ఆనంద్, కోడి పిల్ల చెంచు కుమార్, సుభాష్ చంద్ర, అమృతవల్లి శ్రావణి, కందనూరు రాఘవేంద్ర, సుధాకరయ్య పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ జూడో పోటీలకు మంగళం ట్రెండ్స్ విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 14 ఎస్‌జిఎఫ్ జూడో పోటీలలో మంగళం పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో అనంతపురంలో ఈ నెల 28 నుండి 30 వరకు నిర్వహించే ఎస్జీఎఫ్ జూడో పోటీలకు భావన (9వ తరగతి), స్వాతి (7వ తరగతి), జస్వంత్ (8వ తరగతి), హేమ సాయి (8వ తరగతి) విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కేశవ నాయుడు, పీడీలు సాంబ శివరావు, సురేష్, రూపలత తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయులు మురళి, రాజశేఖర్, శ్రీధర్ అభినందించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు సుభాష్ చంద్రదాస్ రూ. వెయ్యి నగదు బహుమతి ప్రదానం చేశారన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులు శశిపాండు 10వ తరగతి, జీవిత 9వ తరగతి రేపటి నుండి ప్రకాశం జిల్లా సింగరాయకొండలో నిర్వహించే ఎస్జీఎఫ్ అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

చంద్రగిరి ఎంపీడీవోగా అమరనాథ రెడ్డి

ప్రజాశక్తి-చంద్రగిరి: చంద్రగిరి ఎంపీడీవోగా జి అమరనాథ రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీ వోకి సిబ్బంది పూలమాలలతో స్వాగతం పలికారు. మండలంలో కూలీలకు పనులు కల్పించి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. మండల ప్రజలకు అందు బాటులో ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏవో శేఖర్, కార్యాలయ సిబ్బంది పాల్గొ న్నారు.

'నారాయణ'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

మాట్లాడుతున్న ముఖ్య అతిథులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 18 నుండి 22 వ తేదీ వరకు ఆటోమోటివ్ మోడల్స్ డిజైన్, టెస్టింగ్ "పై ఐదు రోజులు ఫ్యాకల్టీ డెవలప్ మెంటు ప్రోగ్రాం విజయవంతంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు విశ్వసేనారెడ్డి ప్రారం భించారు. ప్రారంభోత్సవ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో నూతన ధోరణులు, పరిశ్రమ అవసరాలు, ఆధునిక వాహన సాంకేతిక పరిజ్ఞానాలను అధ్యాపకులకు పరిచయం చేయడానికి ఉద్దేశించిన డిజైన్ అండ్ టెస్టింగ్ ఆఫ్ ఆటోమోటివ్ మోడల్స్ అనే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను అధ్యాపకులు దృఢమైన అవగాహన కలిగి ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ఇఇఇ విభాగధిపతి డాక్టరు కెపి ప్రసాద్ రావు వాహనాల స్ట్రక్చరల్ , డైనమిక్ అనాలిసిస్‌పై మాట్లాడారు. తదుపరి రోజులు డాక్టరు డి రాజేష్ రెడ్డి, కో కన్వీనర్ డాక్టరు జగదీష్ , స్వర్ణ , శరవణన్ అధ్యాపకులు మోడల్ సిమ్యులేషన్, క్రాష్ టెస్టింగ్ ఫండమెంటల్స్, ఎలక్ట్రిక్ వాహనాల డిజైన్ ప్రాసెస్, వాహన పనితీరు మూల్యాంకనం వంటి అనేక ముఖ్య అంశాలపై ఉపన్యాసాలు అందించారు. ఈకార్యక్రమంలో (ఎఫ్. డి. పి) వివిధ ఇంజనీరింగ్ కాలేజెస్ నుంచి 50 మంది అధ్యాపకులు , పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డా దత్తాత్రేయశర్మ, సెక్రటరీ వినయ్, అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వివిధ విభాగాధిపతులు ,అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీధర్ రెడ్డికి పరామర్శ

శ్రీధర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -కోట : కోట మండలం విద్యానగర్‌లో నివసిస్తున్న సీనియర్ టీడీపీ నాయకులు దొరువుకట్ట గ్రామానికి చెందిన మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేసుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో శనివారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్, వెంకన్నపాలెం పంచాయతీ సర్పంచ్ కోకర్ల మధు యాదవ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చంద్రగిరి : చంద్రగిరి మండలం పరిధిలోని దొర్నగంబాల పంచాయతీ పరిధిలోని ఉన్నత పాఠశాలలో చదువు తున్న 20 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థి భాను ప్రకాష్‌కి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కృతజ్ఞతలు తెలిపారు. దొర్నగంబాల ఉన్నత పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లడంతో పాటు సొంత ఊరులో చదివిన పాఠశాలకు మెరుగైన వసతులతో అభివృద్ధి చేయాలని సంకల్పం పెట్టుకున్న భాను ప్రకాష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దాత భాను ప్రకాష్ మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో ఎనలేని అభివృద్ధి చెందుతుందని అందుకు తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం దాత అందించిన సైకిళ్లను విద్యార్థులకు ఎమ్మెల్యే, దాత భాను ప్రకాష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పాఠశాల సిబ్బంది, కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హాకీ టోర్నమెంటు ప్రారంభం

ప్రజాశక్తి -చంద్రగిరి : చంద్రగిరి ప్రభుత బాలుర పాఠశాలలో 69వ రాష్ట్ర స్థాయి అండర్ 14 , బాల, బాలికల హాకీ టోర్నమెంట్‌ను ముఖ్య అతిథి, ఎమ్మెల్యే పులివర్తి నాని, జాతీయ హాకీ క్రీడాకారిణి రజిని ప్రారంభించారు. ఎమ్మెల్యేకి జిల్లా విద్యాశాఖ అధికారి, శాప్ డైరెక్టర్, మండల స్థాయి అధికారులు, పాఠశాల హెడ్ మాస్టర్, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ముందు జ్యోతి ప్రజ్వలను చేసి జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని,రజనీ ప్రారంభించారు. అనంతరం బాలికల చేసిన నృత్యాలను ఎమ్మెల్యే పులివర్తి నాని తిలకించారు. హాకీ టోర్నమెంట్ కు విచ్చేసిన బాల బాలికలను ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు. హాకీ టోర్నమెంట్ కోసం 13 జిల్లాల నుండి వచ్చిన ప్రతి విద్యార్థికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. టోర్నమెంట్ కు వచ్చిన అతిథులకు జ్ఞాపికలను అందించి ఎమ్మెల్యే గౌరవించారు. అనంతరం క్రీడా ప్రాంగణంలో హాకీ ఆడి టోర్నమెంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటుగా, మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF PRINCIPAL SUBORDINATE JUDGE AT PONNERI
MCOP NO: 93 /2024
Thota Parimala - **Petitioner**
Vs
1. K.Krishnamoorthy
2. Shriram General Insurance Company Ltd - **Respondents**
To
R1: K.Krishnamoorthy, S/o.Kannan Kanna, No.6-53, Kandluru Village, KVB Puram Mandal, Tirupathi District, Andhra Pradesh-517 643. **-1st Respondent**
Please take Notice that the above case was filed by the Petitioner for Compansation, same was posted for your appearance to make any Objection on 04/02/2026 at 10.30 A.M. either in person or through your counsel if you fail to appear on that day case will be decided as Exparte.
S.C.PALLAVAN., B.Sc.,B.L.,
B.PRABAVATHI., B.SC.,B.L.,
B.KAVITHA, B.C.A.,B.L.,
Counsel for Petitioner

IN THE COURT OF HON'BLE III ADDL., DISTRICT JUDGE :: TIRUPATI
I.A. No. 183 OF 2025
O.S. No.246 of 2018
B. Rama Chandra Reddy ....**Petitioner/Plaintiff**
Vs...
M/s. Cherishma Housing Pvt. Ltd., Rep., by Its M.D., Sri C.N. Mallikarjuna Reddy And two others ...**Respondents/Defendants**
NOTICE TO RESPONDENT NO.1/ DEFENDANT NO.1 BY WAY OF SUBSTITUTE SERVICE
TO
RESPONDENT NO.1/DEFENDANT NO-1:
M/s. Cherishma Housing Pvt. Ltd., Represented by Its Managing Director C.N. Mallikarjuna Reddy having its office at 508 A-5th Floor, Chenji Plaza, K.T. Road, Tirupati 517 501, Tirupati District,.
Take notice that, the Petitioner/ Plaintiff filed the above I.A. No.183 of 2025 in the above suit which stands posted to 02-12-2025 for your appearance. Hence you are hereby required to appear before the above named Court on the aforesaid date at 10.30 a.m. onwards either in person or through an advocate and file your objections else, the matter will be decided as exparte.
Hearing Date: 02-12-2025
K. RAMANATHAN,
ADVOCATE, THIRUPATHI

క్రైం న్యూస్

నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : పుత్తూరు–నగరి హైవే రోడ్డుపై రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న రామమూర్తి రెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు రవిని పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పుత్తూరు అర్బన్ సీఐ రెడ్డి శేఖర్ కథనం మేరకు..మృతుడు వై రామమూర్తి రెడ్డి (55) పల్లూరు గ్రామానికి చెందినవాడని తెలిపారు. నిందితుడు వి రవి తమిళనాడు తిరువల్లూరు జిల్లాలోని కేశవరాజకుప్పం గ్రామానికి చెందిన వాడు.. రవి కొంత కాలంగా చెన్నై, తిరుత్తణి, అరక్కోణం, రేణిగుంట, పుత్తూరు పరిసరాల్లో తిరుగుతూ ప్లాస్టిక్ బాటిళ్లు, పేపర్లు సేకరించి వాటిని అమ్ముకొని జీవనం సాగించేవాడు. ఈ నెల 19వ తేదీ పుత్తూరు గొల్లపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రామమూర్తి రెడ్డి హీరో ప్యాషన్ బైక్‌పై వెళుతుండగా రవి లిఫ్ట్ అడిగాడు. మాట మాట పెరిగి ఇద్దరి మధ్య తగాదా చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. కోపావేశంతో రవి తన వద్ద ఉన్న చాకుతో మృతుడి మెడపై బలంగా పొడవడంతో, రామమూర్తి రెడ్డి అక్కడికక్కడే కుప్పకూలి మరణించాడు. ఘటన తరువాత రవి పరారయ్యాడు. దీంతో పోలీసులు ముమ్మర గాలింపు చేపట్టి 22వ తేదీ ఉదయం వేపగుంట క్రాస్ రోడ్డు వద్ద రవిని అరెస్ట్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ టీఎన్ పాలెం సెక్షన్ పరిధిలో అటవీ క్షేత్రాధికారి సుదర్శన్ రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు ఆంజనేయపురం వద్ద వాహనాల తనిఖీలలో ఆరు లక్షల విలువైన 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అధికారుల కథనం మేరకు.. టిఎన్ పాలెం సెక్షన్ సిబ్బందితో కలిసి ఆంజనేయపురం చెక్‌పోస్టు నుండి మామునూరు వరకు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక కారు వేగంగా రావడాన్ని గమనించి వాహనాన్ని ఆపమని టార్చ్ లైట్లతో సందేశం ఇవ్వగా ఆ వాహన చోదకుడు అటవీ శాఖ అధికారులను గుర్తించి కారు విడిచిపెట్టి పారిపోయారన్నారు. ఆ కారులో పరిశీలించగా 280 కేజీల పది ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిని అక్రమ రవాణా ద్వారా తరలిస్తున్నట్లు నిర్ధారించుకుని అటవీ శాఖ కార్యాలయానికి తరలించమన్నారు. ఈ దాడులలో డిఆర్ఓ ఆర్ఎస్ చైతన్య, ఎఫ్బిఓ వెంకటేశ్వరరావు, కరకంబాడి బీటు ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రీ, వెంకటేష్, ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి: ఏపీఎంటీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దేశానికి పట్టుకొమ్మ లైన యువత మాదక ద్రవ్యాల వైపు వెళ్లకూడదని ఏపీఎంటీ ధనుంజయ రెడ్డి తెలిపారు. మాదక ద్రవ్యాల ముక్త భారత్ కింద శనివారం జి ఎన్ కండ్రిగ జడ్పీ హైస్కూల్, భీముని చెరువులలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. టీనేజ్ వయసులోని యువతి, యువకుల్లో వచ్చే మార్పులు తల్లిదండ్రులు గమనించారని తెలిపారు. వాటి వైపు ఆకర్షతులు కాకుండా వొకవైపు కని పెట్టాలని సూచించారు. వ్యసనాల బారి పడకుండా ఉన్నతంగా అభివృద్ధి చెందితే కుటుంబ జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, రాజేశ్వరి, నిమ్మి వివో అధ్యక్షులు, వీవోఏ రాధిక, సీఆర్పీలు, వివోలీడర్లు లీడర్లు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సు ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి ప్రభుత్వ బాలుర పాఠశాలలో నూతన ఐటి ,ఐటిఈఎస్ ఒకేషనల్ ల్యాబ్ ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం ప్రారంభించారు. ఒకేషనల్ ల్యాబ్ కు సుమారు 2.5 లక్షల విలువ కలిగిన కంప్యూటర్లు, ఫర్నీచర్ ను వితరణ చేసిన దాత భాను ప్రకాష్‌ని ఎమ్మెల్యే పులివర్తి నాని ఘనంగా సన్మానించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి తన వంతు సాయం అందిం చడానికి ప్రయత్ని స్తున్నానని దాత భాను ప్రకాష్ తెలి పారు. మండలంలో మరిన్ని పాఠశాలలకు తన వంతు సహా య సహకారాలు అందిస్తానని దాత తెలిపారు. ప్రతి విద్యార్థి ఆరవ తరగతి నుండే కంప్యూటర్ పై పట్టు సాధించడానికి తన ఈ ప్రయత్నం అని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు.

శ్రీ సూళ్ళూరుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.NO.124/2024
నెల్లూరు మురళి ...వాది
వర్సెస్
ఎం.ఎస్. లవకుమార్ ...ప్రతివాది
దావానోటీసు
ఎం.ఎస్.లవకుమార్, తండ్రి ఎం.ఎస్.వెంకట సుబ్బయ్య, డోర్ నెం. 3–5–220, ఆత్రేయవీధి, సూళ్ళూరుపేట పోస్టు, టౌన్ & మండలం, తిరుపతి జిల్లా.
ఇందుమూలముగా మీకు తెలియజేయడమేమనగా పై తెలిపిన వాది పైకోర్టులో మీపై దావావేసి మీకు దావా నోటీసులు పంపినను మీకు జారీ కానందున పైకోర్టువారు మీ హాజరు నిమిత్తం వాయిదా తే 1.12.2025దిన వేసి యున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10:30ని॥లకు స్వయంగాగానీ మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై మీకున్న ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును లేనిచో మీ పరోక్షమున ఏమియును లేదని శ్రీకోర్టువారు తీర్మానించెదరు.
ఇట్లు
యల్.గణపతి, B.A, B.L
వాది తరపు న్యాయవాది, సూళ్ళూరుపేట

శ్రీయుత సూళ్ళూరుపేటప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.NO. 31/2022
O.S.NO.26/2020
నాగం సత్యనారాయణ ...D.H.R
వర్సెస్
నవలూరి దుర్గ వెంకట సుబ్రమణయ్యం ...J.D.R
నోటీసు
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై తెలిపిన D.H.R పై కోర్టులో మీపై E.P. పిటిషన్ దాఖలు చేసియున్నారు. శ్రీకోర్టువారి ఉత్తర్వుల నిమిత్తం మీకు పలుమార్లు నోటీసుల పంపినను జారీ కాలేదు. కనుక శ్రీకోర్టువారు పై కేసులో మీకు నోటీసులు జారీ కావడం లేదని మీకు నోటీసులు వాయిదా తేది 3–12–2025న వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10:30 గం॥లకు నేరుగాగానీ, ప్లీడరుద్వారా గానీ హాజరై మీకున్న ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
ఇట్లు
V T JALANDHAR REDDY,
K.JYOTHI,
D.H.R తరపు న్యాయవాలు, సూళ్ళూరుపేట
9440380539

శ్రీయుత సూళ్ళూరుపేటప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.NO. 32/2024
O.S.NO.57/2020
రుద్రపాటి అనిత ...D.H.R
వర్సెస్
కుమరన్ విజయ్‌చంద్ర ...J.D.R
నోటీసు
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై తెలిపిన D.H.R పై కోర్టులో మీపై E.P. పిటిషన్ దాఖలు చేసియున్నారు. శ్రీకోర్టువారి ఉత్తర్వుల నిమిత్తం మీకు పలుమార్లు నోటీసుల పంపినను జారీ కాలేదు. కనుక శ్రీకోర్టువారు పై కేసులో మీకు నోటీసులు జారీ కావడం లేదని మీకు నోటీసులు వాయిదా తేది 3–12–2025న వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10:30 గం॥లకు నేరుగాగానీ, ప్లీడరుద్వారా గానీ హాజరై మీకున్న ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
ఇట్లు
V T JALANDHAR REDDY,
K.JYOTHI,
D.H.R తరపు న్యాయవాలు, సూళ్ళూరుపేట
9440380539

వార్డులలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు

వార్డులలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక 18,19 వార్డులలో పుత్తూరు మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్ గాలి జీవరత్నం నాయుడు, పుత్తూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉమాశంకర్ రెడ్డి 19వ వార్డు కుమార్ కలిసి వార్డులలో ప్రజా సమస్యలను శనివారం పరిశీలించారు. వార్డులో సీసీ రోడ్డు సమస్య , ఆర్టీసీ కాలనీలో సిమెంట్ రోడ్డు, డస్ట్ బిన్, డ్రైనేజీల సమస్యలు వున్నాయని మున్సిపల్ కమిషనర్ తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరిస్తానని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

వెండి కిరీటం బహూకరిస్తున్న దాతలు

చక్రేశ్వరుడికి వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో ఉన్న శ్రీచక్రేశ్వర స్వామికి పట్టణానికి చెందిన వెంకటస్వామి రూ. 4 లక్షలు విలువజేసే వెండి కిరీటాన్ని వితరణ చేశారు. కిరీటాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేసి ఉత్సవాల సమయంలో అలంకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి యాదవ్ కుటుంబ సభ్యులు స్వప్న, హరీష్, మన్నెంపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెంచయ్యనాయుడును సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

రంగినేనికి సత్కారాల వెల్లువ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా రెండో పర్యాయం ఎన్నికైన రంగినేని చెంచయ్య నాయుడుకు శనివారం పట్టణానికి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. స్వీట్లు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. కమిటీలో ముస్లిం మైనార్టీ నాయకుడు మహమ్మద్ షఫీకి అవకాశం కల్పించడంపై హర్ష వ్యక్తం చేశారు. రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీర్ అలీ, టౌన్ బ్యాంక్ చైర్మన్ ఖాదర్ బాషా, ఖాదర్ నాయకులు పాల్గొన్నారు.

రెయిన్‌బో స్కూలు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రేణిగుంట:

రెయిన్‌బో స్కూల్లో శనివారం విద్యార్థులు లెడ్ కాన్ఫరెన్స్ విజయవంతంగా నిర్వహించారు. కరస్పాండెంట్ చైర్మన్ అథావుల్లా ఖాన్, అకడమిక్ డైరెక్టర్ అరీఫ్, ప్రిన్సిపాల్ షెహేర్‌భాను మార్గదర్శకత్వంలో నిర్వహించారు. విద్యార్థులు తమ తరగతుల్లో నేర్చుకున్న విషయాలను వివిధ ప్రాజెక్టుల రూపంలో ఆత్మ విశ్వాసంతో తమ తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యం చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా విద్యార్థుల కోడింగ్ నైపుణ్యాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ప్రతి విద్యార్థి సమాగ్రాభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని నిర్వహణ మరోసారి స్పష్టం చేసిందని కరస్పాండెంట్ అథావుల్లా ఖాన్ తెలిపారు.

వైభవంగా పద్మావతి అమ్మవారి గరుడోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శనివారం రాత్రి అమ్మవారు శ్రీవారి బంగారు పాదాలు ధరించి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ ఆలయ నాలుగు మాడ వీధుల్లో రాత్రి 7 గంటలకు అమ్మవారి గరుడ వాహన సేవ ప్రారంభమైంది. గరుడసేవ రోజున అమ్మవారికి శ్రీవారి స్వర్ణ పాదాలు అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. గరుడసేవ రోజున తిరుమలలో స్వామివారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుత్మంతునిపై విహరిస్తారు. తిరుచానూరులో అమ్మవారికి గరుడ సేవ జరుగుతున్నపుడు శ్రీవారు తన గుర్తుగా అమ్మవారికి తన బంగారు పాదాలను పంపుతున్నారు. ఈ వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, పనబాక లక్ష్మి, సాంబశివరావు, జానకి దేవి, జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ కే.వి. మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఆలయ అర్చకులు బాబుస్వామి, శ్రీనివాస చార్యులు, అర్చకులు, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై విహరిస్తున్న పద్మావతీదేవి

ఎన్‌సిసి ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న దృశ్యం

క్రమశిక్షణే ఎన్‌సీసీ లక్ష్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : దేశభక్తి, క్రమశిక్షణ యువతలో పెంపొందించడమే ఎన్‌సీసీ ప్రధాన లక్ష్యమని తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ క్యాప్టెన్ ఆర్జే ఆత్రే అన్నారు. తిరుపతి ఎన్ సీసీ నగర్‌లో శనివారం 78వ ఎన్‌సీసీ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యత, పర్యావరణ పరిరక్షణ, క్రమశిక్షణ, దేశాభివృద్ధిలో యువత పాత్ర, దేశభక్తి ప్రధానాంశాలుగా ఎన్ సీసీ 78 ఏళ్ల క్రితం భారతదేశ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి పూర్తి స్థాయిలో విజయవంతంగా నడుస్తోందని కొనియాడారు. విద్యార్థులు ఎన్సీసీలో చేరేందుకు దృష్టి సారించాలని, తల్లిదండ్రులు సైతం విద్యార్థులను ఎన్సీసీలో చేరేందుకు ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థి జీవితంలో అకడమిక్ విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ అలవరుచుకోవాలని, దీంతో విద్యార్థి జీవితం ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని తెలిపారు. అనంతరం జాతీయ జెండాకు ఎన్సీసీ అధికారులు, 5వ బెటాలియన్ మహిళా క్యాడెట్లు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎన్సీసీ నగరలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎన్‌సిసి గ్రూపునకు చెందిన కల్నల్స్, ఎన్సీసీ అధికాథులు, పలు గ్రూప్ కు చెందిన ఎన్సీసీ క్యాడెట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని నవంబర్ 28న వర్సిటీ హెల్త్ సెంటర్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్లడ్ డొనేషన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రెక్టార్ అప్పారావు, రెజిస్ట్రారు భూపతి నాయుడు విడుదల చేశారు. రక్తదానం ఒక మహత్తర సేవ అని, ప్రతి విద్యార్థి సమాజం పట్ల బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షకార్యదర్శులు నరసన్న, వినోద్, రాష్ట్ర యూనివర్సిటీల కో కన్వీనర్ అశోక్ కుమార్, మాతేశ్వరి, తిరుమలేష్, శ్రీకాంత్, గీతా, మాతేశ్వరి, ఆకాష్, భాస్కర్, నంద, శ్రావణి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించండి

మాట్లాడుతున్న వ్యవసాయ శాఖాధికారులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పర్యావరణ కాలుష్యం, కృత్రిమ ఎరువుల వినియోగాన్ని తగ్గించే ప్రకతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు సిబ్బంది కృషి చేయాలని శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ ఏడిఏ రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ఐదు మండలాల వ్యవసాయ శాఖ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. రైతులను ప్రోత్సహించే తీరును విశదీకరించి చెప్పారు. అనంతరం ప్రకకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో ఏటీఎం మోడల్ ను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రవి కుమార్, మధు, వెంకటాచలం పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్ :వెటర్నరీ సైన్స్ కళాశాల ఎన్ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం పరీక్షా హాల్ ప్రాంగణంలో విద్యార్థుల వ్యవహారాల డీన్ డాక్టరు వి వైకుంఠరావు, అసోసియేట్ డీన్ డాక్టరు పి జగపతి రామయ్య శనివారం ప్రారంభించారు. ఆవిష్కరణలో విద్యార్థి కార్యకలాపాల డీన్ రక్తదానం ప్రాముఖ్యతను వెల్లడిస్తూ, ఒక యూనిట్ రక్తం అత్యవసర పరిస్థితుల్లో ఎన్నో ప్రాణాలను రక్షిస్తుందని చెప్పారు. అసోసియేట్ డీన్ డాక్టరు పి జగపతి రామయ్య మాట్లాడుతూ ఈ మహోన్నత సేవలో భాగస్వాములు అయిన రక్తదాతలను అభినందించారు. ఈ రక్తదాన శిబిరంలో మొత్తం 43 మంది స్వచ్ఛంద దాతలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తిరుపతి ఖజానాధికారి ఎం. వెంకట సుబ్బారావు, ఎన్ఎస్ఎస్అ ధికారులు డాక్టరు స్వేథ, డాక్టరుస్వేథ కాంతి, డాక్టరు టి.వి. చైతన్య కుమార్, డాక్టరుఎ. తేజ, కళాశాల అధ్యాపకులు డాక్టరు సుధీర్, డాక్టరు మురళి, డాక్టరు ఎం. శ్రావంతి, డాక్టరు యు. వినోద్ పాల్గొన్నారు.

అమర్ రాజా క్వార్టర్స్‌లో చోరీ

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని అమర్ రాజా క్వార్టర్సులో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఈ తరుణంలో క్వార్టర్స్‌లో 450 గ్రాములు బంగారం, మూడు కిలోల వెండిని గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని రేణిగుంట అర్బన్ పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా వెంటనే రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఆధారాలు సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ జయచంద్ర తెలిపారు.

డాక్యుమెంట్ రైటర్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి-నాయుడుపేట:డాక్యుమెంట్ రైటర్ కాళహస్తి శ్రీనివాసులు మాతృమూర్తి కాళహస్తి అనసూయమ్మ శనివారం ఉదయం కన్ను మూశారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం ఐదున్నర గంటలకు కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న పలువురు నాయకులు, అధికారులు, మిత్రులు శ్రేయోభిలాషులు విన్నమాల గ్రామంలోని శ్రీనివాసులు నివాసానికి చేరుకుని అన సూయమ్మ పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాం క్షించారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు విన్న మాల గ్రామంలోని వారి స్వగృహం నుండి అనసూ యమ్మ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

సిఆర్‌సి సమావేశాల్లో ఎంఈఓల పిలుపు

ప్రజాశక్తి- సోమల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచేందుకు కృషి చేయాలని, బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతాన్ని మెరుగుపరచాలని సోమల, నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సిఆర్సి సమావేశాల్లో మండల విద్యాశాఖ అధికారులు విజయ కుమారి, శివ రత్నమ్మ కోరారు. శనివారం నిర్వహించిన సిఆర్‌సి సమావేశంలో ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించేందుకు ఉపాధ్యాయులు నిరంతర కృషి చేయాలన్నారు. విద్యాశాఖ ఆదేశాలను తప్పక అమలు చేసే విధంగా ముందుకు సాగాలని ఎంఈఓలు కోరారు. పదవ తరగతి విద్యార్థులు 100శాతం ఫలితాలు సాధించేందుకు విద్యాశక్తి పథకాన్ని మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.

ఇంటర్న్‌షిప్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతికి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ సత్వ ఇన్ఫోటెక్ సహకారంతో ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద తెలిపారు. ఈ సందర్భంగా సత్వ ఇన్ఫోటెక్ ప్రతినిధులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని, ముఖ్యంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఇంటర్న్‌షిప్‌ల విధి విధానాలు, వాటి ద్వారా లభించే సాంకేతిక నైపుణ్యాలు, భవిష్యత్తులో కల్పించే ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గది చదువులకే పరిమితం కాకుండా, ఇంటర్న్‌షిప్‌ల ద్వారా ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను ఇప్పుడే నేర్చుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బిఎల్‌పి.లత, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి- వి కోట: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంలోనే ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన వీకోట మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ప్రముఖ మైనార్టీ వైసీపీ నేత అక్మల్, వారి సతీమణి వి కోట ఎంపీటీసీ 2 సెగ్మెంట్ రిజ్వానా, మరో వైసిపి నేత ఏకే ఖలీల్ ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున ముస్లిం మైనార్టీలు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వీకోట లోని టీపు సర్కిల్ వద్ద శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడే ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. వి కోటలో షాదీ మహల్ నిర్మాణం పనుల వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని త్వరలో పనులు వేగవంతం చేసి పూర్తి చేస్తామన్నారు.